కర్నూలు । నంద్యాల
వార్త
12 ఆగస్టు , 2022 శుక్రవారం పేజీలు 4

# జగనన్న విద్యా దీవెన ఫీజు రీయింబర్స్మెంట్ జమ..

**జిల్లా వ్యాప్తంగా 41032 మంది తల్లుల ఖాతాల్లో రూ.24.84 కోట్లు జమ - జిల్లా కలెక్టర్ కోటేశ్వర రావు**



**కర్నూలు, ఆగస్ట్ 11, ప్రభాతవార్త :** విద్యకు పేదరికం ఏ మాత్రం అడ్డుకాకూడదన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, జగనన్న విద్యా దీవెన కింద 2022 ఏప్రిల్ - జూన్ త్రైమాసికానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్మెంట్ మొత్తాన్ని జిల్లా వ్యాప్తంగా అర్హులయిన 46084 మంది విద్యార్థులకు చెందిన 41032 మంది తల్లుల ఖాతాల్లో రూ.24.84 కోట్లు జమ ప్రభుత్వం జమ చేసిందని జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు పేర్కొన్నారు. జగనన్న విద్యా దీవెన కింద 2022 ఏప్రిల్ - జూన్ త్రైమాసికానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్మెంట్ మొత్తాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి బాపట్ల నుంచి బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న కెవిఆర్ డిగ్రీ కళాశాలలో జిల్లాకలెక్టర్‌తో పాటు కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, కర్నూలు నగర మేయర్ బి.వై రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... పేద విద్యార్థులకు ఫీజు కష్టాలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకాన్ని అమలు చేస్తోందన్నారు. జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా కానుక, అమ్మబడి తదితర పథకాలతో ఎంతోమంది విద్యార్థుల జీవితాలలో ప్రభుత్వం వెలుగు తెచ్చిందన్నారు. కర్నూలు నగర మేయర్ బి.వై రామయ్య మాట్లాడుతూ పాదయాత్రలో పేద విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్న ఏకైక నాయకుడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు. అనంతరం జిల్లాలో జగనన్న విద్యా దీవెన కింద ఏప్రిల్ - జూన్ 2022 మాసాల ఫీ రీయింబర్స్మెంట్ కు సంబంధించిన రూ.24.84 కోట్ల మెగా చెక్కును కలెక్టర్, ఎమ్మెల్యే, మేయర్ అందించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ప్రతాప్ సూర్య నారాయణ రెడ్డి, కెవిఆర్ కళాశాల ప్రిన్సిపల్ ఇందిర శాంతి, విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యక్రమాలపై.. ఉక్కుపాదం

**-పోలీసులు నేరాలు నియంత్రించాలి : ఎస్పి సిద్దార్థ్ కౌశల్**

**మంత్రాలయం, ఆగస్టు 11, ప్రభాతవార్త:** జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపి నేరాలు నియంత్రిస్తామని జిల్లా ఎస్పి సిద్దార్థ్ కౌశల్ అన్నారు. గురువారం నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలోని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ మాధవరం గ్రామంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ మీదుగా కర్ణాటక మద్యం, గుట్కాలు మన రాష్ట్రంలోకి వస్తున్నట్లు సమాచారం ఉన్నట్లు తెలిపారు. ఎంతటి వారైనా అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని చెప్పారు. మంత్రాలయం, మాధవరం పోలీస్ స్టేషన్లలో సిబ్బంది తక్కువగా ఉన్నమాట వాస్తవమన్నారు. ఉన్న సిబ్బందితోనే ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేశారు. మహిళా పోలీసులకు పత్రాలు అందజేశారు. తుంగభద్ర నదిలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. భక్తులు ఎవరూ నదిలోకి వెళ్ళకుండా పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహించాలని కోరారు. అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకొని స్వామివారి ఆశీర్వాదం పొందారు. వీరికి పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థులు రాఘవేంద్రస్వామి మొమెంటో, ఫల, పుష్ప, మంత్రాక్షితలతో ఆశీర్వదించారు. వీరివెంట సిఐ భాస్కర్, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు పోలీస్ సిబ్బంది ఉన్నారు.



# శ్రీమఠంలో ఘనంగా శాఖోత్సవం..

- స్వామి వారికి రజత మంటపోత్సవం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు







**మంత్రాలయం, ఆగస్టు 11, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో స్వామివారి 351వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఆరాధనోత్సవాల్లో భాగంగా స్వామివారి బృందావనానికి పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యపూజల్లో భాగంగా వేకువజామునుంచే సుప్రభాత సేవ, నిర్మల విసర్జన సేవ, రాయర పాదపూజ. అష్టోదకం, కనకాభిషేకం, పంచామృతాభిషేకం, పల్లకిసేవ, మహా మంగళ హారతి నిర్వహించారు. అనంతరం మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీమఠం ప్రాకారంలో చెన్నై పట్టణానికి చెందిన డాక్టర్ సుమనాచార్ చేసిన ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. రాత్రి శ్రీమఠం ప్రాకారంలో శాఖోత్సవంలో భాగంగా వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలకు పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహించి, మంగళ హారతులిచ్చారు. అశేష భక్తుల మధ్య స్వామి వారికి రజత మంటపోత్సవం నిర్వహించి భక్తులను ఆశీర్వదించారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు:**

శ్రీ రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాలలో భాగంగా రెండవ రోజు ఏర్పాటు చేసిన సాంసస్కృతిక కార్యక్రమాలుభక్తులను ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా బెంగళూరు పట్టణానికి చెందిన శ్రీ హనుమేషాచార్ చేసిన వేణువదన కార్యక్రమం భక్తులను అలరించింది. అదేవిధంగా తిరుపతి పట్టణానికి చెందిన విద్వాన్ శ్రీ సరస్వతి ప్రసాద్ ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. విజయవాడ పట్టణానికి చెందిన భారతి నృత్య కేంద్రం వారు చేసిన కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, పండిత కేసరి రాజా ఎస్ గిరియాచార్, ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కె శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి, పిఆర్ఓ వ్యాసరాజాచారి, ద్వారపాలక అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.



# యధేచ్ఛగా నాన్ ట్రేడ్ సిమెంటు దందా..!

- గాడనిద్రలో వాణిజ్య పన్నుల శాఖ, అధికారులు..
- కాసులు గుమ్మరించుకుంటున్న సిమెంటు ఇటుక బట్టీల వ్యాపారస్తులు

**ఆదోని, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ఆదోని నియోజకవర్గంలో ఉన్న సిమెంటు, ఇటుకల బట్టీల నుంచి రోజుకు టన్నుల కొద్ది నాన్‌ట్రేడ్ సిమెంటు విక్రయిస్తూ ఇటుకల బట్టీల వారు కాసులు గుమ్మరించుకుంటున్నారు. వాణిజ్య పన్నుల శాఖ, అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడ చూడలేకపోతున్నారని ట్రేడ్ వ్యాపారస్తులు అధికారుల తీరుపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. నాన్‌ట్రేడ్ సిమెంటు విక్రయించే ఇటుక బట్టీల వారు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ వారి ఖజానా నింపుకుంటూ రోజురోజుకు వేలకువేలు, లక్షలు గుమ్మరించుకుంటున్నా అడ్డుకునే వారే లేకపోయేసరికి వారికి అడ్డు అదుపులేకుండ పోయింది. నియోజకవర్గంలో ప్రధాన కాలనీలలో పల్లెల్లో చిన్నభవనం లేదు, పెద్దభవనం లేదు ఇటుక బట్టీలలో ఉన్న వారి సొంత ట్రాక్టర్లలో, ఆటోలలో లోడ్ చేసి గ్రామాల్లో, వార్డుల్లో ప్రధాన రోడ్లలో తిరుగుతున్నా, అన్‌లోడ్ చేస్తున్నా ఏ వాణిజ్య పన్నుల శాఖ అధికారుల కళ్లకు దొరక్కపోవడం విడ్డూరం. నాన్‌ట్రేడ్ సిమెంటు బస్తాలపైనే నేరుగా రాసుంటుంది (నాట్ ఫర్ రిటైల్ సేల్) అని అంటే ఆ బస్తాలకు బిల్లు ఉండదూ బిల్లు వేయడానికి ఉండదూ. (జిఎస్‌టి) గూడ్స్ సర్వీస్ ట్యాక్స్, (ఎస్‌జిఎస్‌టి)స్టేట్ సర్వీస్ ట్యాక్స్, (సిజిఎస్‌టి)సెంట్రల్ సర్వీస్ ట్యాక్స్ ఇలా ఏమీ ఉండదూ. అన్ని ట్యాక్సులు ఎగ్గొట్టి ఆ డబ్బులను సిమెంటు ఇటుక బట్టీల వారు మింగేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. నిజానికి ప్రభుత్వం నాన్‌ట్రేడ్ సిమెంటు కేవలం ప్రభుత్వ పనులకు మాత్రమే వినియోగించాలని అదికూడ టెండర్లు తీసుకున్న కాంట్రాక్టర్ల దగ్గర జిఎస్‌టి నం. ఉండి ప్రభుత్వానికి సంబంధించిన రోడ్డు పనులు, డ్రైన్లు, బ్రిడ్జిలు వగైరా వంటి నిర్వహణకు మాత్రమే ఈ నాన్‌ట్రేడ్ సిమెంటు వినియోగించాలని ప్రభుత్వము, అధికారులు నిబంధనలు పెట్టినా...

2లో

## వరద నీటి ఉధృతితో..

# ఉధృతంగా తుంగభద్రమ్మ

**- 33గేట్లు ఎత్తి దిగువ నదికి నీరు విడుదల**

**హొళగుంద, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ఎగువ ప్రాంతాలైన అగుంబె, శృంగేరి, కీర్తనహల్లి, వరనాడు, శివమొగ్గ, చిక్‌మంగళూరు తదితర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి 1,62,522క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రూపంలో వచ్చి చేరుతుందని బోర్డు అధికారులు తెలిపారు. అదేవిధంగా కాలువకు 10,611క్యూసెక్కుల నీరు కాలువలకు విడుదల చేస్తూ మొత్తం మీద 33గేట్లలో 28గేట్లు మూడున్నర అడుగుల మేర మరో ఐదుగేట్లు ఒక అడుగు మేర ఎత్తి సుమారు 1,51,851క్యూసెక్కుల నీటిని దిగువ నదికి విడుదల చేస్తున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. తుంగభద్ర జలాశయానికి 1,77,936క్యూసెక్కుల నీరు ఎగువ ప్రాంతాల నుండి వచ్చి చేరుతున్నాయన్నారు. డ్యాంలో 1631.71అడుగుల వద్ద 100.640టిఎంసిల నీరు నిల్వ ఉందన్నారు. ఆంధ్ర, కర్ణాటక తెలంగాణ మూడు రాష్ట్రాలకు సాగు, తాగునీరు అందిస్తున్న తుంగభద్ర జలాశయానికి ఈ ఏడాది ముందుగానే వరద నీరు చేరడం మొదలైందని అధికారులు వెల్లడించారు.



# పేదరికంతో విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కాకూడదు

**- జిల్లాలో 38,496 మంది తల్లుల ఖాతాల్లో రూ.25.64 కోట్ల జమ : జిల్లా కలెక్టర్**

**నంద్యాల, ఆగష్టు 11, ప్రభాతవార్తః** జిల్లాలో పేదరికం కారణంగా ఏ విద్యార్థికి కూడ ఉన్నత చదువులకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించారని జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్ తెలిపారు. బుధవారం జగనన్న విద్యాదీవెనలో భాగంగా మూడవ విడత కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన విధానాన్ని కలెక్టర్ విడియోకాన్ఫరెన్స్ హాల్‌లో వర్చువల్ ద్వారా తిలకించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాష, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, సోషల్ వెల్ఫేర్ డిడి చింతామణి, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత విద్యకు ఏ విద్యార్థి దూరం కాకుడదని చదువుల ఖర్చుతో తల్లిదండ్రులు అప్పులపాలు



కాకూడదన్న సమున్నత లక్ష్యంతో జగనన్న విద్యాదీవెన ఈప్రభుత్వం ప్రవేశపెట్టింద న్నారు. ఈపథకం కింద ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, తదితర కోర్సులు చదివే అర్హులైన పేద విద్యార్థులు కళాశాలలకు చెల్లించాల్సిన పూర్తిఫీజుల మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. తల్లుల ఖాతాల్లో జమచేశామని కళాశాలలకు వెళ్లి యాజమాన్యాలను ప్రశ్నించే హక్కు కల్పిస్తున్నామ న్నారు. ఎస్సీ సంక్షేమ కింద 10,573 మంది విద్యార్థులుండగా 9358 మంది తల్లుల ఖాతాల్లో రూ.5.54 కోట్లు, ఎస్టీ సంక్షేమం కింద 1381 మంది విద్యార్థులుండగా 1204 మంది తల్లుల ఖాతాల్లో రూ.0.75 కోట్లు, బిసి సంక్షేమం కింద 17,027 మంది విద్యార్థులుండగా 15,170 మంది తల్లుల ఖాతాల్లో రూ.9.85 కోట్లు, ఈబిసి కింద 4,788 మంది విద్యార్థులుండగా 4,390 మంది తల్లులఖాతాల్లో రూ.4.05 కోట్లు, ముస్లిం మైనార్టీ కింద 6,745 మంది విద్యార్థులుండగా 5,954 తల్లుల ఖాతాల్లో రూ.3.62 కోట్లు, కాపు సంక్షేమం కింద తల్లుల ఖాతాల్లో రూ.1.77కోట్లు, క్రిస్టియన్‌మైనార్టీ రూ.0.06 కోట్లు జమచేసినట్లు తెలిపారు. విద్యాదీవెన కింద 2022 ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి రూ.25.64 కోట్ల చెక్కును పంపిణి చేశామన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం అరికట్టాలి..!

**- జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్**

**హాలహర్వి, ఆగస్టు 11, ప్రభాతవార్త :** కర్ణాటక రాష్ట్రం నుండి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి కర్ణాటక అక్రమ మద్యంను అరికట్టాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఐపిఎస్ చెక్‌పోస్ట్ సిఐ శేషాచలంను ఆదేశించారు. గురువారం ఆంధ్రా-కర్ణాటక సరిహద్దులో ఉన్న హాలహర్వి చెక్‌పోస్టును, పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తనిఖీ చేశారు. ముందుగా హాలహర్వి పోలీస స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ మాట్లాడుతూ అక్రమంగా మద్యం పట్టుబడిన వాహనాలపై కేసులను త్వరగా మూసివేయాలని లోక్ అదాలత్ కేసులను కౌన్సిలింగ్ చేసి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్, ఆలూరు సిఐ ఈశ్వరయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్, చెక్‌పోస్టు సిఐ శేషాచలం, ఎస్ఐ వెంకటేశం, హెడ్‌కానిస్టేబుల్ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# వరద నీటితో పోటేత్తుతున్న శ్రీశైలం రిజర్వయర్..

**10 రెడియల్ క్రస్ట్‌గేట్లతో కొనసాగుతున్న నీటివిడుదల..**

**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు11, ప్రభాతవార్త :** వరద నీటి తాకిడితో శ్రీశైలం రిజర్వయర్ పోటేత్తుతుంది. జలసవ్వడులతో సాగిపోతూ సందర్శకులను పలకరిస్తుంది. పాల నురుగల సోయగాలతో పచ్చని ప్రకృతి నడుమ ఉవ్వేత్తున ఎగిసిపడుతూ సందడి చేస్తుంది. శ్రీశైలం రిజర్వయర్ నుండి పరవళ్లుత్రొక్కుతూ మంత్రముగ్ధులను చేస్తుంది. ఈక్రమంలోనే శ్రీశైలం రిజర్వయర్‌కు వరద ప్రవాహవేగం మరింతగా ఇన్‌ఫ్లో పుంజుకోవడంతో శ్రీశైలం జలశయం ఇంజనీర్లు అప్రమత్తంతో 10 క్రస్ట్‌గేట్లతో నీటి విడుదల కొనసాగిస్తూ ఒక్కొక్కటి 10 అడుగుల నుండి 15 అడుగుల ఎత్తుమేరకు పెంచి స్పిల్‌వే గుండా 3,76,670 క్యూసేక్కుల నీటిని సాగర్ జలశయంకు తరలిస్తున్నారు. కాగా శ్రీశైలం డ్యాంకు అత్యదిక క్యూసేక్కుల నీరు వచ్చిచేరుతుండడంతో రిజర్వయర్ నీటితో తోనికిసులాడుతుంది. అదే విధంగా జలశయం నుండి జాలువారుతున్న కృష్ణమ్మ అందాలను చూచేందుకు సందర్శకులు తాకిడి పెరిగింది. ఈక్రమంలోనే శ్రీశైలంకు ఎగువన ఉన్నా జూరాల గేట్లను తెరచి స్పిల్ వే ద్వారా 1,92,095 క్యూసేక్కుల నీరు, విధ్యుత్ ఉత్పత్తి ద్వారా 29,464 క్యూసేక్కుల



నీరు, సుంకేసుల నుండి 1,76,359 క్యూసేక్కుల నీరు, మొత్తం 3,97,918 క్యూసేక్కుల నీటి ప్రవాహం వచ్చి చేరుకుంది. కాగా శ్రీశైలం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా డ్యాం నీటినిల్వ సామర్థ్యం 215.807 టియంసిలుగా ఉంటుంది. ఈక్రమంలోనే శ్రీశైలం రిజర్వయర్ గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి నీటిమట్టం 884.40 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 211.9572 టియంసిలుగా నమొదు అయింది. అదే విధంగా వచ్చిచేరుతున్న వరద నీటి ప్రవాహంతో తెలంగాణా రాష్ట్రం ఎడమ గట్టు జలవిధ్యుత్ కేంద్రాల్లో టి.ఎస్.జెన్-కో అదికారులు విధ్యుత్ ఉత్పత్తిని కోనసాగిస్తు ఉత్పత్తి అనంతరం దిగువకు 31,784 క్యూసేక్కుల నీరు విడుదల చేయడం జరుగుతుంది. అదే విధంగా శ్రీశైలం కుడిగట్టు జలవిధ్యుత్ కేంద్రంలో ఉత్పత్తి చేస్తు 26,410 క్యూసేక్కుల నీరు విడుదల చేయడం జరుగుతుంది. అదే విధంగా శ్రీశైలం డ్యాంకు ఇదే క్రమంలో వదర ప్రవాహం చేరుతుండడంతో జలశయం ఇంజనీర్లు క్రస్ట్‌గేట్ల ఎత్తున పెంచి నీటిని విడుదల చేస్తూన్నారు. ఈక్రమంలోనే శ్రీశైలం క్రస్ట్‌గేట్ల నుండి, కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ఉత్పత్తి అనంతరం మొత్తం 4,34,864 క్యూసేక్కుల నీరు విడుదల చేయడం జరుగుతుంది.

# అనురాగానికి ప్రతీక.. రక్షాబంధన్ వేడుక..

- సోదరి ప్రేమను పంచే రాఖీబంధం..
- అపురూపం..అన్నా చెల్లెళ్ల అనుబంధం..
- తరాలు మారినా తరగని సంప్రదాయం..
- నేడు రాఖీ పౌర్ణమి..



**కోసిగి, ఆగస్టు 11, ప్రభాతవార్త :**

ఆడపడుచులు తమ మెట్టింటి నుండి పుట్టింటికి వచ్చి సోదరుల ముంజేతికి రక్షా కడతారు.. అన్నాచెల్లెల మధ్య అనురాగానికి ప్రతీకగా కాకుండా సమాజంలో మానవ బంధాలను పెంచడంతోనూ రాఖీ పండుగ దోహదపడుతుందని చెప్పవచ్చు.. శ్రావణ పౌర్ణమి సందర్భంగా నిర్వహించే రక్షాబంధన్ ఏటా ఎంతో ఘనంగా జరుపునే పండుగ.. ఈ ఏడాది కూడా అన్నా చెల్లెళ్ల అనుబంధానికి, ఆప్యాయత, అనురాగాలకు ప్రతీక కానుంది.. మనదేశ సంస్కృతి సంప్రదాయంలో పండుగలకు కుటుంబ వ్యవస్థకు ఎంతో విశిష్టత ఉంది.. రాఖీ పండుగ రుతుక్రమాన్ని శాస్త్రీయతను తెలుపుతోంది.. శ్రావణమాసం ప్రకృతి రుతువులలో వచ్చే ముఖ్యమైన మాసం.. ఈమాసంలో వచ్చే అతి ముఖ్యమైన పండుగలో రాఖీ పండుగ ఒకటి.. సోదర సోదరీమణులు ఆత్మీయత అనురాగాలకు సూచకంగా దీనిని నిర్వహించుకుంటారు.. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచేది రాఖీ పండుగ..ఆడపిల్లకు తండ్రి తర్వాత అంతటి రక్షణగా నిలిచేది సోదరుడు..అందుకే తన సోదరుడు ఉన్నత స్థితిలో ఉండాలని ప్రతి సోదరి ఆకాంక్షిస్తుంది..తండ్రి ఉన్నా లేకపోయినా "పుట్టినింటి ప్రేమ"ను పంచే వ్యక్తి అన్న, ఆ సోదరుడి క్షేమాన్ని, ఉన్నతిని కోరుకుంటూ అతడి చేతికి 'రక్ష'ను సోదరి కడితే, ఆ రక్ష కట్టిన తోబుట్టువు జీవితాంతం రక్షణగా నిలుస్తానని, తన సోదరి జీవితం హాయిగా సాగిపోవాలని ప్రేమతో మిఠాయి తినిపిస్తాడు సోదరుడు..ఈ అద్భుత అనురాగ ఘట్టానికి సాక్షీభూతంగా నిలిచేదే 'రాఖీ పండుగ'.. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో వచ్చేటువంటి పౌర్ణమిని రాఖీ పండుగ పేరుతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవటం ఆనవాయితి..

సృష్టిలో తియ్యని పవిత్ర బంధం సోదరీ సోదరమణుల అనుబంధం..అటువంటి బంధాన్ని గుర్తు చేస్తూ చెల్లెలు, ఓ అక్కా తన అన్న లేదా తమ్ముడి చేతికి రక్షాబంధనం చేస్తే నీకు రక్షగా నేనున్నానంటూ సోదరుడు అభయమిచ్చేదే రాఖీ పౌర్ణమి పర్వదినం. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమిని రాఖీ పర్వదినంగా వేడుకగా జరుపుకుంటారు. హిందూ సంప్రదాయంలో శ్రావణ పౌర్ణమికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. దీనిని కేవలం రాఖీ పౌర్ణమి గానే కాకుండా జంధ్యాల పౌర్ణమిగానూ, వైఖానస జయంతిగానూ, హయగ్రీవ జయంతిగా కూడా జరుపుకుంటారు. అయితే కొన్ని దశాబ్దాలుగా శ్రావణపౌర్ణమి అంటే అన్నా చెల్లెల్ల పండుగగా రాఖీ పౌర్ణమి సంతరించుకుంది..

# విద్యతోనే భవిషత్తు మారుతుంది -ఎమ్మేల్యే

**నందికొట్కూరు, ఆగష్టు 11, ప్రభాతవార్త:** విద్యతోనే భవిషత్తు మారుతుందని ప్రతి ఇంటిని విద్యాలయంలా చేసుకోవాలని నియోజకవర్గం ఎమ్మేల్యే తోగూరు ఆర్థర్ అన్నారు. గురువారం బాపట్లలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యా దీవెన పథకం కింద పూర్తి ఫీజు రియింబర్స్‌మెంట్ మూడవ విడత నిధులను విడుదల చేసి ప్రారంభించారు. నందికొట్కూరు నియోకవర్గస్థాయిలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా దీవెన (వర్చువల్ విధానంలో) నిధులు విడుదల కార్యక్రమానికి ఎమ్మేల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సి.యం. సందేశం అనంతరం ఎమ్మేల్యే మాట్లాడుతు రాష్ట్రంలో ఎవరు కూడ విద్యకు దూరం కాకూడదనే సంకల్పంతో జగనన్న విద్య దీవెన, జగనన్న వసతి, వంటి పథకాల ద్వారా విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలిచేందుకు తల్లిదండ్రుల ఖాతాలలో నగదు జమచేయడం జరుగుతున్నదని కావున మీరు కూడ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. నందికొట్కూరు నియోజకవర్గానికి 7025 మంది విద్యార్థులకు 6191 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.3.93.37.541లు సి.యం.బటన్ నొక్కి జమచేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కొరకు వేల కోట్లు ఖర్చు చేస్తున్నదని దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థాయిలో ఉండాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ రాజశేఖర్‌బాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.సునీత, గిరిజన సంక్షేమ



అధికారివుశేనయ్య, మండల విద్యాధికారులు సుభాన్, శ్రీమతి ఫైజున్నిసాబేగం, మండల అభివృద్ధి అధికారులు శ్రీమతి మంజులవాణి, శ్రీమతి నాగశివలీల, సింగిల్ విండో చైర్మన్ సగినేల వుశేనయ్య, రాష్ట్ర ఉర్దు ఆకాడమీ డైరెక్టర్ అబ్దుల్‌షుకూర్, హౌసింగ్ కార్పోరేషన్ డైరెక్టర్ రమాదేవి, జగనన్న విద్యాదీవెన కో-ఆర్డినేటర్ మహేష్‌నాయుడు పాల్గొన్నారు.

# శ్రీశైలం మల్లన్న హుండి ఆదాయం..

# రూ.3.68.22 కోట్లు

**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు11, ప్రభాతవార్త :** శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి, అమ్మవార్ల ఉభయ దేవాలయాల హుండిల లెక్కింపు గురువారంనాడు శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాదికారి ఎస్.లవన్న ఆద్వార్యంలో లెక్కింపును నిర్వహించడం జరిగింది. ఈక్రమంలోనే దేవస్థానానికి రూ.3,68,22,723/-ల నగదు రాబడిగా లబించింది. ఈ హుండి ఆదాయాన్ని భక్తులు గత 35 రోజులలో సమర్పించడం జరిగింది. ఈ నగదుతో పాటు 184 గ్రాముల 300 మిల్లిగ్రాముల బంగారు, 05 కేజీల 860 గ్రాముల వెండి లబించాయి. అదే విధంగా 1113 యు.ఎస్.ఏ డాలర్లు, 440 ఇంగ్లాడు ఫౌండ్స్, కత్తార్ రియాల్స్ 120, సింగపూర్ డాలర్లు12, ఓమన్ బైసా 400, ఆస్ట్రేలియా డాలర్లు80, యు.ఏ.ఈ దిర్హామ్స్ 05, కెనడా డాలర్లు 05, కువైట్ దిర్హామ్స్ 20, మలేసియా రింగిట్స్ 5, పిలిపినాస్ పిసో 100, మొదలైన విదేశీ కరెన్సీ కూడా ఈ హుండల లెక్కింపులో లబించాయి. కాగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. దేవస్థాన అన్ని విబాగాల అదికారులు, సిబ్బంది, మరియు శివసేవకులు ఈ హుండి లెక్కింపులో పాల్గొన్నారు.



## అనురాగానికి ప్రతీక.. రక్షాబంధన్ వేడుక..

(మొదటి పేజీ తరువాయి)

**పురాణ ప్రశస్తి :** రక్షాబంధన్‌కు పౌరాణిక ప్రాశస్త్యం ఉంది.. పూర్వం రాక్షసులకు దేవతలకు భీకర యుద్ధం జరుగుతుంది..రాక్షసుల చేతిలో దేవతలు ఓడిపోయారు..దీంతో నిరాశలో ఉన్న ఇంద్రుడు తన రాజధాని అయిన అమరావతిలో దాక్కుంటాడు.. అయితే అమరావతిపై రాక్షసరాజు దండయాత్ర చేయబోతున్నాడని గ్రహించిన ఇంద్రుడి భార్య శచీదేవి పార్వతి పరమేశ్వరులను, లక్ష్మీనారాయణలను అత్యంత భక్తితో పూజిస్తుంది.. ఆ పూజలో ఒక రక్షబంధనాన్ని తయారు చేసి దానిని తన భర్త ఇంద్రుడి చేతికి కడుతుంది. దాంతో ఇంద్రుడు నూతనోత్తేజంతో రాక్షసులపై పోరాడి విజయం సాధిస్తాడు. ఆ రోజు శ్రావణ పౌర్ణమి. అందుకే ఆ రోజున రక్షాబంధనం ధరిస్తే జయం కలుగుతుందనేది పురాణ ప్రతీతి..అంతేకాక బలి చక్రవర్తి కథ కూడా ఉంది.. ఇక మహాభారతంలో ద్రౌపది కృష్ణుల వృత్తాంతం మనకు రక్షాబంధన ప్రాముఖ్యతను తెలియజేస్తుంది.. ఇక రాజపుత్ర వీరులు దీనికి అధిక ప్రాధాన్యమిచ్చారు. మేవాడ మహారాణి కర్మవతిపై బహదూర్‌షా కన్నేసి యుద్ధం ప్రకటించాడు..అప్పుడు ఆమె మొగల్ చక్రవర్తికి రాఖీ పంపి పరిస్థితి వివరిస్తుంది. మొగల్ చక్రవర్తి హుమయూన్ ఆమెను కాపాడుతాడు. ముఖ్యంగా స్వాతంత్ర్య సంగ్రామంలో మన సేనానులు చేతికి రక్షాబంధాలు కట్టుకుని యుద్ధం చేసినట్లు తెలుస్తోంది..దీన్ని వీర కంకణంగా సైనికులు భావించేవారు. మనుషుల్లో ప్రేమ, మమత, అనురాగాల్ని పెంపొందిచేందుకు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాకూర్ శాంతి నికేతన్‌లో రక్షాబంధన్ నిర్వహించేవాడు..

**సోదరి చేతి భోజనంతో విజయ సిద్ధి:** రాఖీ పౌర్ణమి రోజున సోదరి చేత రాఖీ కట్టించుకుని ఆమె తన శక్తి కొలది కానుకలిచ్చి, ఆమె చేతి భోజనం చేస్తే ఆ సంవత్సరమంతా సోదరుడికి అన్ని విషయాల్లో విజయం కలుగుతుందనేది పెద్దల మాట..ఇలా సోదరి చేతి భోజనం చేయటాన్ని భగినీ హస్త భోజనంగా పిలుస్తారు.. నేడు కేవలం తోడబుట్టిన అన్నదమ్ములకే కాకుండా తాము అన్నదమ్ములగా భావించే చుట్టు పక్కల వారికి సైతం రాఖీ కడుతూ ఒక కొత్త సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబిస్తున్నారు..

**జంధ్యాల పౌర్ణమి:** రాఖీ పౌర్ణమి రోజున బ్రాహ్మణులు జంధ్యాల పౌర్ణమిని జరుపుకుంటారు. ఈ సందర్భంగా యజ్ఞోపవేత ధారణకు అధికారం ఉన్న ప్రతి వారూ యజ్ఞోపవేతం (జంధ్యం)ను మార్చుకుంటారు. శ్రావణ పౌర్ణమికి ఇంకొక ప్రత్యేకత హయగ్రీవ జయంతిని జరుపుకోవడం..ఒకప్పుడు కేవలం మహారాష్ట్ర, గుజరాత్ వంటి ఉత్తరభారత రాష్ట్రాలకే పరిమితమైన రాఖీ పౌర్ణమి పండుగ క్రమేపీ దక్షిణాధి రాష్ట్రాలకు లోనూ ఎంతో వైభవంగా ప్రజలు జరుపుకుంటున్నారు. శుక్రవారం రాఖీ పండుగను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఇందు కోసం మార్కెట్‌లోని వివిధ రకాల రాఖీలను కొనుగోలు చేసే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు..

## యధేచ్ఛగా నాన్ ట్రేడ్ సిమెంటు దందా..!

(మొదటి పేజీ తరువాయి)

ఆదోని గడ్డపై నాన్‌ట్రేడ్ అడ్డా అంటూ సిమెంటు బట్టీల వారికి నాన్‌ట్రేడ్ సిమెంటు బస్తాలు టన్నుల టన్నులు నెలనెలా ఎలా వస్తాయో అంతుచిక్కని రహస్యం. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు దాడులు చేయక రోజురోజుకు పెట్రేగిపోతూ అమ్ముకుంటున్నారు. అధికారులు ఏ వస్తువునైనా బిల్లు లేకపోతే ఎంతటి చర్యలైనా తీసుకునే హక్కులు ఉన్నా అటువైపు కన్నెత్తి చూడకపోవడంలో చేతివాటమో,అధికారుల అలసత్వమో,వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల కొరతో తెలియడం లేదు. నాన్‌ట్రేడ్‌కి సంబంధించి సిమెంటు ఇటుకల వాల్ల బట్టీలలో (నిబంధనలకు విరుద్ధంగా) ఉత్పత్తి చేసేదేకాక,భవన నిర్మాణ వినియోగదారులకు కొనుగోలు చేస్తూ కాసుల వర్షం కురిపించుకుంటున్నారు. సిమెంటు ఇటుకల బట్టీల యజమానులు ట్రేడ్ సిమెంటు ధర ప్రస్తుతం మార్కెట్‌లో రూ.360నుంచి రూ.400లు పలుకుతుంటే నాన్‌ట్రేడ్ సిమెంటు బస్తా ధర రూ.270లకు దొరుకుతుండడంతో నాన్‌ట్రేడ్ సిమెంటు ఇటుకల ఉత్పత్తి కొరకు తెప్పించుకుని,వాటి తయారీకే కాకుండ సిమెంటు ఇటుకల కోసం వచ్చే వినియోగదారులకు ప్రస్తుతం మార్కెట్‌లో ప్రధాన సిమెంటు కంపెనీల ధరలకు 10నుంచి 30అటు ఇటుగా అమ్ముకుంటున్నారు. అంటే సుమారుగా ఒకబస్తాకు ఎటువంటి ట్యాక్సులు కట్టకుండ రూ.100ల వరకు రోజుల టన్నుల టన్నులు సిమెంటు బస్తాలు విక్రయిస్తూ వేలకు వేలు ఆదాయం నేరుగా వారి (ఖజానా)గల్లా పెట్టెలోకి తోసేసుకుంటున్నారు. ప్రభుత్వానికి సంబంధించి ప్రతీ వస్తువుపై పన్నులు వేసే ఆదాయ వనరుల శాఖ వాణిజ్య శాఖకు సంబంధించి ప్రభుత్వ ఖజానాకు నేరుగా గండి కొడుతూ ఇంత వ్యవహారం,వ్యాపారం చేస్తున్నా టన్నుల కొద్ది వారి గోడౌన్‌లలో స్టాకులు పెట్టుకున్నా..సిమెంటు ఇటుక బట్టీల వ్యాపారులపై వీరికి నాన్‌ట్రేడ్ సిమెంటు అందిస్తున్న వారిపై అధికారులు ఎటువంటి దాడులు చేయకపోవడం అధికారుల తీరుపట్ల ట్రేడ్ వ్యాపారస్తులు మండిపడుతున్నారు. నాన్‌ట్రేడ్ వ్యాపారం చేస్తు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నా వారి ఇప్పటికైనా శాఖాపరమైన చర్యలు తీసుకుంటారో.. లేదో..లేదా..ఇవన్నీ షరామామూలే అంటూ మామూళ్ల ముట్టజెప్పుకుంటారో వేచిచూడాల్సిందే మరి..?

## ఘన నీరా'జనం' మధ్య ఎంఎల్ఎ గడపగడపకు..

– రూ.51లక్షలతో నూతన దేవాలయ నిర్మాణానికి భూమిపూజ..



**చిర్తనకల్లు(కోసిగి), ఆగస్టు 11, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ బాలనాగిరెడ్డి పర్యటిస్తున్న గ్రామాల్లో ప్రజలు ఘన నీరాజనం పడుతున్నారు.. గురువారం మండల పరిధిలోని చిర్తనకల్లు గ్రామంలో మండల ఇంచార్జీ మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ పాటీల్ ఈరన్న అధ్యక్షతన ఎంఎల్ఎ బాలనాగిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులతో కలసి నిర్వహించారు.. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి వారి క్షేమాన్ని తెలుసుకుంటూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు.. ముఖ్యంగా వృద్దులకు, వితంతవులకు, వికలాంగులకు, పేదలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సక్రమంగా అందుతున్నాయా.. అలాగే నెల నెల సామాజిక ఫించన్లు ఎలా లఅందుతున్నాయని మరీ అడిగి అడిగి తెలుసుకుంటుండడంతో గ్రామంలో ప్రజలు ముఖ్యంగా మహిళలు నీరాజనం పలికారు.. మరోసారి ఎంఎల్ఎగా మీరే రావాలంటూ, రాష్ట్రంలో జగన్ ముఖ్యమంత్రి కావాలంటూ నినాదాలు చేసి హారతులిచ్చి నుదుట తిలకం దిద్దారు..సంక్షేమ పథకాలు అందని వారికి ఎందుకు వారికి అందలేదని అధికారులను ప్రశ్నించి అవకాశం ఉన్నవారికి ఆయా సంక్షేమ పథకాలు అందేలా ప్రతి ఒక్కరు చొరవ తీసుకుని పనిచేయాలని ఆదేశించారు..ఈ కార్యక్రమంలో ఎంపీపీ లవకుశ ఈరన్న, సీనియర్ నాయకులు నాడిగేని నరసింహులు, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, తహశీల్దార్ రుద్రగౌడ్, ఎపివో జయరామ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గురుశేఖరమ్మ, ఏఈలు యుగంధర్‌రెడ్డి, మల్లి కార్జునరెడ్డి, సేక్షావలి, మండల స్థాయి అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

**రూ.51 లక్షలతో దేవాలయ నిర్మాణానికి భూమిపూజ:** దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.51 లక్షల వ్యయంతో నిర్మింప తలపెట్టిన లక్ష్మినరసింహస్వామి దేవాలయాని ఎంఎల్ఎ బాలనాగిరెడ్డి భూమి పూజ నిర్వహించారు.. గురువారం మండల పరిధిలోని చిర్తనకల్లు గ్రామంలో మండల ఇంచార్జీ మురళీమోహన్‌రెడ్డితో కలసి ఎంఎల్ఎ ఈ కార్యక్రమాని చేపట్టారు.. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఎ బాలనాగిరెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి ఈ దేవాలయం నిర్మించాలని గ్రామస్తులు పలుమార్లు తన దృష్టికి తీసుకురాగా దేవాదాయ శాఖ మంత్రితో చర్చించి ఈ వేవాలయ నిర్మాణానికి సంబందించి రూ51 లక్షలను మంజూరు చేయించడం జరిగిందన్నారు..గ్రామస్తులు దీనిని గుర్తించి భక్తి భావాలతో పూజలు చేసి తనను దీవించాలని కోరారు.. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు విఆర్‌వో మారెన్న, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు..

## బనగానపల్లెలో బీజేపీ యువ సంఘర్షణ ర్యాలీ

**బనగానపల్లెరూరల్,ఆగస్టు11,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షులు బి.శరత్ చంద్ర కుమార్ మరియు రాష్ట్ర యువ మోర్చ ఉపాధ్యక్షులు బండి ఆనంద్ ఆధ్వర్యంలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా శరత్ చంద్ర కుమార్ మరియు యువ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మిదల విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో యువ సంఘర్షణ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా శరత్‌చంద్ర కుమార్ మరియు బండి ఆనంద్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను,ప్రజా వ్యతిరేక పాలనను అరికట్టడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యంగా తెలిపారు.ఇందులో భాగంగా యువసంఘర్షన యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని బనగానపల్లెలో కూడా గురువారం నిర్వహించినట్లు తెలిపారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లుతెరుచుకుని ప్రభుత్వ పాలన ఎటు నడుస్తుందో తెలుసుకుని ప్రజలకు ఆమోదయోగ్యమైన పాలనను అందించాలని వారు సూచించారు.ఇప్పటికి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను వీడనాడకపోతే భవిష్యత్‌లో బీజేపీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేయడానికి వెనుకాడబోమని వారు హెచ్చరించారు.బైక్ ర్యాలీలో బీజేపీ జిల్లా నేత దమ్మాల వెంకటసుబ్బయ్య,ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షులు శివకృష్ణ యాదవ్,భవాని సాయి,రామసుబ్బయ్య,వేణుయాదవ్,శివరామిరెడ్డి,యాదగిరి,సయ్యద్ జావీద్,నాగరాజు, శివరాముడు, కొలిమిగుండ్ల వేణుయాదవ్,సురేష్,గంగరాజు,అవుకు మండల శాఖ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎన్.మహేశ్వరరెడ్డి,శివారెడ్డి,బాలవెంకటేశ్వర్లు,పలువురు బీజేపీ నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

**బనగానపల్లెరూరల్,ఆగస్టు11,ప్రభాతవార్త:** డోన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లికార్జునరెడ్డి గురువారం మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.ఆయన ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను పర్యవేక్షించారు.గర్భిణీ స్త్రీలలో కొన్ని కేసులు హైరిస్క్‌గా గుర్తించి వారికి ప్రత్యేక సేవలు అందించాలని సూచించారు.ఆరోగ్య కేంద్రం డాక్టర్ శివశంకరుడు సిబ్బందికి పలు సూచనలు,సలహాలు ఇచ్చారు.రికార్డులను పరిశీలించారు.స్థానిక పాఠశాలలో విద్యార్థులకు రక్తహీనతను గురించి అవగాహన కల్పించి వారికి ఐరన్,ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేశారు.వైదు ్యలు శివశంకరుడు, సోహేల్ బాబు,ఆరోగ్య సిబ్బంది,పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం ఐజయ్య,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కళారూపాలను ప్రదర్శించిన డిగ్రీ కళాశాల విద్యార్థులు

**బనగానపల్లెరూరల్,ఆగస్టు11,ప్రభాతవార్త:** బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలతాదేవి ఆధ్వర్యంలో మరియు కళాశాల వ్యాయామా అధ్యాపకురాలు విజయకుమారి నేతృత్వంలో స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా దేశంలోని వివిధ రాష్ట్రాల కళారూపాలను ప్రదర్శించడమైంది.ఈ కళారూపాల యొక్క నేపథ్యాన్ని విద్యార్థులు తిలకిస్తూ ఆ రాష్ట్రం ఆ కళాప్రదర్శనను చూస్తూ వివిధ రాష్ట్రాలలోని అభిరుచులను,సాంప్రదాయాలను తెలుసుకుని పరవశించారు.ఈ కార్యక్రమంలో బడేసాహెబ్,వసుంధర, పి.సూర్యనారాయణరెడ్డి,కోటేశ్వరరావు,శ్రీనివాసులు,కౌసల్య,వహీదా,సుధాకర్‌రెడ్డి,అసిస్టెంట్ పీడీ సయ్యద్,విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## తూనికల శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీ

**పత్తికొండ,ఆగస్టు11,ప్రభాతవార్త:** పత్తికొండ పట్టణంలో జగనన్న గోరుముద్దలో భాగంగా చిన్నారులకు అందిస్తున్న చిక్కీలను తూనికల శాఖ అధికారులు గురువారం తనిఖీ చేశారు.పట్టణంలోని సెంటర్ హైస్కూల్,ఎంపిపి పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న చిక్కీల పై ఫిర్యాదులు రావడంతో తూనికల శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేష్ కుమార్ చిక్కీల పై ఉన్న తయారీ తేదిని,ఎక్స్‌పైరీ డేట్‌ను ఆయన పరిశీలించారు. ఇందులో భాగంగా కొన్ని చిక్కీలను టెస్ట్ చేసేందుకు తీసుకువెళ్లారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోరుముద్దలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న వాటిని విద్యార్థులకు సక్రమంగా అందించాలని ఆయన సూచించాంచారు.అదే విధంగా చిక్కీలు చెడిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.ట్రాన్స్‌పోర్ట్‌లో ఎటువంటి డ్యామేజ్ కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సరఫరా ఏజెన్సీకి సూచించారు.

## 24 యేళ్లుగా రికార్డులు సృష్టిస్తున్న ఎల్ఐసీ వెంగళ్‌రెడ్డి

**ఆదోనిలీగల్, ఆగస్టు11, ప్రభాతవార్త ;** వంద ఎల్ఐసి పాలసీలు చేయించి ఎల్ఐసీ సంస్థ అభివృద్ధికి కృషి చేసిన వెంగళ్‌రెడ్డి సేవలు మరువలేనివని, ఆయన ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఎల్ఐసీ బ్రాంచి ఏబీఎం గోవిందు పేర్కొన్నారు. జీవిత బీమా ఆదోని బ్రాంచి మేనేజర్ హనుమంతరావు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆదోని బ్రాంచిలో మొదటి నాలుగు నెలల కాలంలో మొట్టమొదటి స్థానంలో శతకవీరుడిగా 100 పాలసీలు చేసి కడప డివిజన్ పరిధిలో సమున్నత స్థానం సాధించిన ఎల్ఐసీ ఛైర్మన్ క్లబ్ మెంబర్ లియాఫి సౌత్ సెంట్రల్ జోన్ కార్యవర్గ సభ్యుడు వల్లపురెడ్డి వెంగళ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆయన కీర్తిని కొనియాడారు. సన్మాన గ్రహీత వెంగళ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజూ ఒక పాలసీ ప్రతి ఇంటికి ఒక ఎల్ఐసీ పాలసీ ఉండాలని ఎల్ఐసీ ఏజెంట్‌గా ఇదే నా పాలసీ అని చెప్పారు. అదేవిధంగా గత 24 సంవత్సరాలుల నుంచి ఎల్ఐసీ పాలసీదారులకు అనునిత్యం వారికి సర్వీస్ ఇస్తూ అలుపనేది లేకుండా నిత్యం ప్రజలతో మమేకమై వారికి వారి కుటుంబాలకు న్యాయంచేసే అవకాశం ఎల్ఐసీ ఇచ్చినందుకు జీవితబీమా సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. నా జీవితం ఎల్ఐసీ జీవితబీమా సంస్థకు నా పాలసీదారులకు అంకితమని చెప్పారు. నాకు గత 24 యేళ్ల నుంచి నాకు సహాయ సహకారాలు అందించిన ఎల్ఐసీ పాలసీదారులకు, ఎల్ఐసీ సిబ్బందికి, నాతోటి ఏజెంట్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఏబీఎం గోవిందు, కార్యాలయ సిబ్బంది, ఏజెంట్లు, లియాఫీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇంటర్ ప్రశ్నపత్రాలు దిద్దే కార్యక్రమం

**నంద్యాల విద్య, ఆగస్టు 11, ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పూర్తి అవడంతో నేటి నుంచి ప్రశ్నపత్రాలు దిద్దే కార్యక్రమం మొదలయినట్లు ఆర్ఐఓ గురువయ్యశెట్టి తెలిపారు. కర్నూలులోని ఇంటర్ కళాశాలల్లో ఈప్రశ్నపత్రాలు దిద్దే కార్యక్రమం మొదలవుతుంది. ఏవరికైతే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయో ఆ కళాశాల లెక్చరర్ అందరు పరీక్షలు దిద్దే కార్యక్రామనికి హాజరుకావాలని లేనిచో ఇంటర్‌బోర్డు అధికారులు తీసుకునే చర్యలకు బాధ్యులు అవుతారని తెలిపారు. జిల్లాకు సుమారుగా 1.24 లక్షల పేపర్లు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈనెల 12న ఎసీవోలకు అన్నిసబ్జెక్టుల వారు విధుల్లో హాజరుకవాలని అదేశించారు. ఈనెల 13 నుంచి అసిస్టెంట్ ఎగ్జామినర్, చీఫ్ ఎగ్జామినర్ విధుల్లో పాల్గొనాలన్నారు. సబ్జెక్టుల వారిగి తెలుగు, ఇంగ్లీషు, హిందీ, బాటనీ, ఉర్దు, అరబిక్, ప్రెంచి, ఫర్మియన్ బాషలకు సంబందించిన సబ్జెక్టు టీచర్లు హాజరుకావాలని ఆయన అదేశించారు.

## రెండవ శనివారం పాఠశాలలు పనిచేయాలి

– ఈనెల 11 నుంచి 15 వరకు అన్ని పాఠశాలల్లో హార్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని నిర్వహించాలి

**నంద్యాల విద్య, ఆగస్టు 11, ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ అదేశాల మేరకు ఈనెల 2వ శనివారం అన్ని పాఠశాలలు పనిదినంగా పనిచేయాలని ప్రతే ్యక ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వల్లో భాగంగా ఈనెల 11 నుంచి 15 వరకు అన్ని పాఠశాలల్లో హార్‌ఘర్ తిరంగ్ కార్య క్రమాన్ని నిర్వహించాలని అదేశించారు. అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రతిరోజు కార్యక్రమాలు నిర్వహించాలని అదేశించారు. 75వ స్వాతంత్ర్య వేడుకల ముగింపు సందర్భంగా ప్రతిపాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించాలి. జాతీయ జెండాను గౌరవించేవిధంగా ప్రతిఒక్కరు ఈకార్యక్రమాల్లో పాల్గొనాలి. ఒకసెల్ఫీ ఫోటో దిగి దాన్ని హార్‌ఘర్‌తిరంగ్ డాట్‌కంలో అప్లోడ్ చేయాలని. పాఠశాలలో విద్యార్థులచే సెమినార్లు, గ్రూప్ డిస్కషన్స్, ఎస్ఎ కాంపిటేషన్, క్విజ్ పోటీలు, డ్యాన్స్, డ్రామ, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలి. గ్రామాల్లో, పట్టణాల్లో విద్యార్థులచే ర్యాలీలు, సైకిల్ ర్యాలీలు చేయాలని అదేశించారు. ప్రతిరోజు విద్యార్ధులచే వందేమాతరం, రఘుపతిరాఘవ రాజారాంతో పాటు దేశభక్తి గీతాలను అలపించాలి. 13న పనిదినంగా భావించాలని పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఘనంగా రక్షాబంధన్ పండుగ

**నంద్యాల హాస్పటల్, ఆగష్టు11, ప్రభాతవార్త:** స్థానిక రామకృష్ణ డిగ్రీ, పిజి కళాశాలలో రక్షబంధన్ పండుగ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా.జి.రామకృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ కళాశాలల్లో చదివే ప్రతి అమ్మాయి వారి వారి సోదరులకు రాఖీ కట్టాలన్నారు. ఈయొక్క రాఖీపండుగ ముఖ్య ఉదే ్దశ్యం సోదరభావాన్ని, స్నేహం, బంధానికి ప్రతీక ఈపడుంగ అన్నారు. ఈపండుగా ఎంతో సామరస్యంగా జరుపుకోవడానికి సహకరించిన అధ్యాపకులకు, సిబ్బంది ప్రోగ్రాం అఫీసర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమాన్ని జాతీయగీతాలాపనతో ముగించారు.

## మిత్రుని కుమార్తె వివాహానికి ఆర్ధికసహాయం అందించిన పూర్వపువిద్యార్ధులు

**వెల్దుర్తి,ఆగస్టు11, ప్రభాతవార్త :** వెల్దుర్తి ఎస్సీ బాలుర వసతిగృహంలో 2000–2001 సంవత్సరం పదోతరగతి బ్యాచ్‌లో తమతో పాటు చదువుకున్న స్నేహితుడు అల్లుగుండు గ్రామానికి చెందిన సోమన్న గత సంవత్సరం రోడ్డుప్రమాదంలో చనిపోయాడు.అయితే అతని కుమార్తె వివాహం నిశ్చయం అయ్యింది.ఈ విషయం తెలుసుకున్న సోమన్న మిత్రులు గురువారం అల్లుగుండు గ్రామానికి వెళ్లి తమ వంతుగా రూ.40వేలు ఆర్థికసహాయం అందించారు.ఈ కార్యక్రమంలో మిత్రబృందం సభ్యులు ఎస్సై శేఖర్,యల్లయ్య,నాగసూరు ్యడు,కేశవులు,వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాతో విద్యార్థులు సైకిల్ ర్యాలీ

**ఆదోనిలీగల్, ఆగస్టు11, ప్రభాతవార్త ;** భారతదేశపు జాతీయ జెండాతో ఆదోనిలోని ఎన్‌సీసీ విద్యార్థులు దేశభక్తిని చాటుతూ గురువారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్, నెహ్రూ మెమోరియల్ హైస్కూల్ హెచ్ఎంలు మల్లికార్జున, హలీంసిద్దిక్‌లు సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ప్రధానమంత్రి ఆదేశాల మేరకు 'ఆజాదికా అమృత్ మహోత్సవం'లో భాగంగా ఈ ర్యాలీని నిర్వహించినట్లు ఎన్‌సీసీ అధికారి కె.రవి తెలిపారు. జాతీయ జెండాను గౌరవించడం మనందరి బాధ్యత అని రవి తెలిపారు. విద్యార్థులు, ఎన్‌సీసీ అధికారులు సైకిల్‌పై జాతీయ జెండాను పెట్టుకొని ప్రధాన రోడ్డు, కాలేజీ, రాంజలరోడ్డు గుండా గణేష్ సర్కిల్ చేరుకుని అనంతరం తమ పాఠశాలను చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో 200ల మంది ఎన్‌సీసీ విద్యార్థులు, ఎన్‌సీసీ అధికారులు అనిల్‌కుమార్, యల్లప్ప, పరిమళ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**ఆదోనిలీగల్, ఆగస్టు11, ప్రభాతవార్త ;** 'ఆజాదికా అమృత్ మహోత్సవం'లో భాగంగా గురువారం ఆదోని పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు న్యాయసేవలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, ఆదోని 2వ అదనపు జిల్లా జడ్జి మండల న్యాయసేవాధికారి సంఘం అధ్యక్షులు జి.భూపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్యానల్ న్యాయవాదులు మాట్లాడుతూ నేడు 75 సంవత్సరాలు స్వాతంత్ర్యం దినోత్సవ వేడుకలను నిర్వహించుకునేందుకు సిద్ధమవడం సంతోషంగా ఉందన్నారు. భారతదేశం దినదినాభివృద్ధి చెందుతుందని చెప్పారు. ప్రతిఒక్కరు న్యాయసేవల గురించి తెలుసుకోవాలన్నారు. ప్రతి మానవుడికి న్యాయపరమైన హక్కులు ఉంటాయని చెప్పారు. మొత్తం 50 మంది విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు బి.వీరేష్, హెచ్ఎం శివకుమారస్వామి, మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం మల్లికార్జున, ఉపాధ్యాయులు ఉరుకుందప్ప, శివకుమారి, ఎస్ఎండీ జుబేర్, ఎం.మహేష్, కె.సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలి

**కొత్తపల్లె,ఆగస్టు11,ప్రభాతవార్త:** గిరిజనులు అన్ని రంగాలలో అభివృద్ధి చెంది సమాజంలో సమాన హక్కులు కలగాలని ఐటీడీఏ స్పెషల్ ఆఫీసర్ కె.జి.నాయక్ అన్నారు.గురువారం మండల కేంద్రంలోని చెంచు సమాఖ్య ఆఫీస్ నందు గిరిజనులకు నన్నారి తయారుచేసేందుకు గిరిజనులు కొండల నుంచి తెచ్చే నన్నారి గడ్డలను ఎలా తయారు చేసుకుని మార్కెట్‌లో విక్రయించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఈ సామాగ్రిని గిరిజనులకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో చెంచు సమాఖ్య సీసీలు యూసుఫ్,సిబ్బంది పాల్గొన్నారు.

## ఆజాది కా అమృత్ ఉత్సవాలలో భాగంగా భారీ ర్యాలీ

**అవుకు,ఆగస్టు11,ప్రభాతవార్త:** అవుకు పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల,ఇంటర్ విద్యార్థులు ఆజాది కా అమృత్ ఉత్సవాలలో భాగంగా గురువారం పట్టణంలోని బస్టాండ్,తేరు,సెంటర్‌ల మీదుగా భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.విద్యార్థులు ప్లష్‌కార్డులు ప్రదర్శిస్తూ నినాదాలతో దారిపొడవునా ఉత్సాహంగా పాల్గొన్నారు.భారతమాత,గాంధీజీ,నెహ్రూ,డాక్టర్ బీఆర్ అంబేద్కర్,సుభాస్ చంద్రబోస్ మొదలుకొని ఝాన్సీ లక్ష్మిబాయి,బేగం హజరత్ మహల్ వంటి స్వాతంత్ర్య సమరయోధులను గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు చల్లా భగీరథరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి మాట్లాడుగూ భారత జాతికి స్వేచ్ఛను ప్రసాదించిన స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని మరోసారి మననం చేసుకునే గొప్ప అవకాశం ఆజాది కా అమృత్ ఉత్సవం ద్వారా కలిగిందన్నారు.ప్రతిఒక్కరు ఇందులో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా స్వాతంత్రోద్యమంలో దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన దేశభక్తులను కొనియాడారు.ఆజాది కా అమృత్ ఉత్సవాల కార్యక్రమంలో ప్రజలందరు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు,ఎంఈవో శ్రీధర్‌రావు,ఎంపిడివో ఆజాంఖాన్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయునీలు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు

– దాదాపు రూ.8లక్షల దాకా అప్పులు ఉన్నట్లు సమాచారం...



**వెల్దుర్తి,ఆగస్టు11,ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎస్.బోయినపల్లి గ్రామంలో గురువారం అప్పుల బాధ తాళలేక రైతు ఉల్లిందకొండ సూరన్న(41) పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల వివరాల మేరకు గ్రామానికి చెందిన ఉల్లిందకొండ దాసన్న,చిన్నయల్లమ్మలకు 6 గురు కుమారులు గత కొద్దిసంవత్సరాల కిందట దాసన్న చనిపోగా ఆమె తనకున్న 8 ఎకరాల పొలంతో పాటు మరో 3 ఎకరాల పొలంను కుమారులతో కలిసి సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తుంది.ముందు నుంచి తల్లి వెంట 3వ కుమారుడు ఉల్లిందకొండ సూరన్న ఉంటూ పొలం పనులు చేసేవాడు.అయితే పత్తిపంట,ఆముదం,మిరప పంటలు సరిగ్గా పండక పొలం సాగుకోసం చేసిన బయటి వ ్యక్తుల వద్ద చేసిన అప్పులు దాదాపు రూ.8లక్షల దాకా పెరిగిపోవడంతో ఆ అప్పును ఎలా తీర్చాలో అంటూ తీవ్ర ఆవేదనకు లోనై ఇంట్లో ఉన్న భార్య పిల్లలను పశువులు మేపేందుకు కల్లానికి పంపి ఇంట్లోనే పురుగుల మందు సేవించి అపస్మారకస్థితిలోకి చేరుకున్నాడు.ఇంటి ప్రక్కల వారు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా వారు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.ఇతనికి భార్య సాలమ్మ ఇద్దకు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నాడు.బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు,తోటిరైతులు అధికారులను కోరుతున్నారు.

## ఘనంగా ఆజాదీకా అమృత్ వేడుకలు

**తుగ్గలి,ఆగస్టు 11,ప్రభాతవార్త :** మండల పరిధిలోని జొన్నగిరి,పగిడిరాయి గ్రామాల్లో గురువారం ఆజాదీకా అమృత్ వేడుకలు అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు,ప్రభుత్వ ఉద్యోగులు,ప్రజా ప్రతినిధులు, ప్రజలతో కలిసి నిర్వహించిన ర్యాలీని ఎంపిడిఓ విజయలలిత ప్రారంభించారు. పగిడిరాయి,జొన్నగిరి చెరువుకట్టలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఎంపిడిఓ విజయలలిత ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎంపిడిఓ విజయలలిత మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్ వేడుకపై విద్యార్థులకు పలు విషయాలను వివరించినట్లు తెలిపారు. ఆగస్టు 15న నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ నెల 13వ తేదీ నుండి 15వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డి వీరరాజు,ఎంఈఓ రమా వెంకటేశ్వర్లు,పంచాయతీ కార్యదర్శులు గోపాల్, నారాయణస్వామి,ఏపిఓ రామకృష్ణ,ఈసి ప్రదీప్,ప్రజా ప్రతినిధులు,సచివాలయ ఉద్యోగులు,గ్రామ వాలంటరీలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దత్తాత్రేయస్వామివారికి విశేష పూజలు

**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు11, ప్రభాతవార్త :** లోక కల్యాణంకోసం దేవస్థానం గురువారంనాడు ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీదత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించడం జరిగింది.కాగా దేవస్థానసేవగా(సర్కారిసేవగా)ఈ కైంకర్యం జరిపించబడింది.ఈ పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహగణపతిపూజను జరిపించబడింది.ఆ తరువాత దత్తాత్రేయసా ్వమివారికి పంచామృతాభిషేకం,విశేష పూజలు నిర్వహించబడ్డాయి.లోకోద్ధరణకోసమై బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు.అందుకే త్రిమూర్తి స ్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్దుడు.కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబందం ఉంది.ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం క్రింద దత్తాత్రేయలవారు తపస్సు చేశారని ప్రతీతి.అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు.కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు.వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది.

## పాదయాత్ర పూర్తి చేసిన కాంగ్రెస్ నాయకులు

**ఆదోని,ఆగస్టు 11,ప్రభాతవార్త :** భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలు పూర్తియిన సందర్భంగా ఏఐసిసి ప్రెసిడెంట్ సోనియాగాంధీ ప్రతి జిల్లాలో 75కి.మీల పాదయాత్ర చేయాలని ఆదేశించారు. సోనియాగాంధీ ఆదేశాల మేరకు 75కి.మీల పాదయాత్రను కాంగ్రెస్ నాయకులు గురువారం పూర్తి చేశారు. ఈ సందర్భంగా డిసిసి వైస్ ప్రెసిడెంట్ దేవిశెట్టి ప్రకాష్,మైనార్టీ డిపార్ట్‌మెంట్ కర్నూలు పార్లమెంట్ సభ్యులు మహమ్మద్ నూర్,కాంగ్రెస్ నాయకులు జయరామ్ సాయి, మద్దిలేటి, రాఘవేంద్రలు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75వసంతాలు పూర్తి కావడంతో సోనియా గాంధీ ఆదేశానుసారం ఆదోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కర్నూలు నుండి ఎమ్మిగనూరు వరకు 75కి.మీలు పాదయాత్ర చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## ఈ నెల 13,14తేదీల్లో ఉచిత వైద్యశిబిరం

**ఆదోని,ఆగస్టు 11,ప్రభాతవార్త :** పట్టణంలోని స్థానిక ఎస్‌కెడి కాలనీ జీరో రోడ్డు నందు గల ప్రసాద్ ఈఎన్‌టి మరియు కర్నూలు శ్రీకృష్ణ స్పీచ్ అండ్ హియరింగ్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఈ నెల 13,14వ తేదీల్లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ రామవరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం డాక్టర్ రామవరప్రసాద్ మరియు కృష్ణ ఆడియోలజిస్ట్‌లు మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరం ఉదయం 9గంటల నుండి రాత్రి 8గంటల వరకు చూడబడునని అలాగే వినికిడి పరీక్షలు,చెవి,ముక్కు,గొంతు పరీక్షలు ఉచితంగా చేయబడునని తెలిపారు. ఈ క్యాంపు నందు బుక్ చేసుకుంటే కంప్యూటర్‌తో అమర్చే వినికిడి,డిజిటల్ మిషన్లపై దాదాపు ప్రత్యేక రాయితీ వర్తిస్తుందని,అలగే సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక తగ్గింపు కలదని చిన్న,పెద్ద అన్ని రకాల వారికి అన్ని విధములైన పరికరములు అందుబాటులో ఉన్నాయని పట్టణ మరియు పరిసర ప్రాంత గ్రామీణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత రిజిస్ట్రేషన్ కొరకు ప్రసాద్ ఇఎన్‌టి ఆసుపత్రి 8074313009,9985088470ను సంప్రదించాలన్నారు.

## ఘనంగా ఆజాదీకా అమృత్ మహోత్సవాలు

**ఆదోని రూరల్,ఆగస్టు 11,ప్రభాతవార్త :** మండల పరిధిలోని అలసందగుత్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధాని మోడీ పిలుపుమేరకు గురువారం ఆజాదీకా అమృత్ మహోత్సవాలు చేపట్టారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అలసందగుత్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు కృష్ణవేణి విద్యార్థులతో పిరమిడ్,యోగా వివిధ రకాల కార్యక్రమాల్లో భాగంగా 75వ స్వాతంత్ర్యాన్ని ప్రతిబింబించేలా 75ఆకృతిలో విద్యార్థులచే ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శేఖన్న,ఉపాధ్యాయులు నర్సయ్య,పెద్దయ్య,మౌలాలి,జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవ

**శ్రీశైలంప్రాజెక్టు,ఆగస్టు11,ప్రభాతవార్త :** శ్రావణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని గురువారంనాడు సాయంకాలం శ్రీస్వామిఅమ్మవార్లకు దేవస్థానం ఊయల సేవ వైభవంగా నిర్వహించడం జరిగింది.ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి,మూలనక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించబడుతోంది.ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్నికాంక్షిసూ ్త అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు.తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహగణపతిపూజ జరిపించబడింది. ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడపచార పూజ జరిపించ బడింది. ఆతరువాత విశేషంగా అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్రనామార్చన జరిపించబడింది.చివరగా ఊయలసేవ నిర్వహించ బడింది. ఊయలసేవను పురస్కరించుకొని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పలంకరణ,పుష్పార్చనలు జరిపించబడ్డాయి.

## ఉపాధి కూలీలతో ఆజాదీకా అమృత మహోత్సవం

**ఆలూరు,ఆగస్టు 11,ప్రభాతవార్త :** మన దేశానికి వచ్చి 75సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఈసారి జరిగే స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతిఒక్కరు జరుపుకునేలా ఆజాదీకా అమృత మహోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా హర్ ఘర్ ఫిరింగా జెండాలో భాగంగా మండల పరిధిలోని కురువల్లి గ్రామంలో అమృత సరోవర్ కింద ఊరు చెరువు వద్ద ఏపిఓ హేమసుందర్. ఎంపిడిఓ అల్లాబకాష్ ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు,ఉపాధి కూలీలతో కలిసి జాతీయ జెండాను చేతబట్టి మార్ ్చఫాస్ట్‌ను చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ అల్లాబకాష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75సం॥లు పూర్తి కావస్తుందని అందులోను భారతదేశం ఎంతో అభివృద్దిని సాధించిందన్నారు. ఆగస్టు 15వ తేదీన తమ ఇళ్ల వద్ద హర్ ఘర్ ఫిరింగా జెండాలో భాగంగా ప్రతిఒక్కరు జాతీయ జెండాను ఎగురవేస్తూ స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలర్పించిన వీరులను స్మరించాలని ఎంపిడిఓ పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరిలోనూ దేశభక్తిని పెంపొందించేలా దేశభక్తి గీతాలాపన చేయాలన్నారు.

## ప్రతిరైతు తప్పకుండా ఈ పంట నమోదు చేసుకోవాలి

**మంత్రాలయం,ఆగస్టు 11,ప్రభాతవార్త:** మంత్రాలయం మండలంలోని ప్రతిరైతు తప్పకుండా ఈ పంట నమోదు చేయించుకోవాలని ఏడిఏ మహమ్మద్‌ఖాద్రిఅన్నారు.గురువారం మంత్రాయంలోని రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు.రైతులు సాగుచేసిన పంటను విఏఏలు ఏ విధంగా ఈపంట నమోదు చేయాలో తెలియజేశారు.ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ రైతులు ఈ పంట నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను పొందవచ్చని తెలిపారు.పంట ఇనూ ్సరెన్ ్స,రైతుభరోసా నిధులు తదితర సంక్షేమ పథకాలను పొందవచ్చని పేర్కొన్నారు.ఈ పంట నమోదు చేయకపోతే సంక్షేమ పథకాలు వర్తించవని వెల్లడించారు.రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలంటే పొలం పాస్‌బుక్,ఆధార్‌కార్డ్,బ్యాంక్ అకౌంట్ బుక్ తప్పకుండాతీసుకురావాలని సూచించారు. రైతులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని స్పష్టం చేశారు.వీరివెంట మండల వ్యవసాయాధికారి గణేష్,ఏఈఓలు నరసింహుడు,రేఖామాధురి,విఏఏలు ఉష,మాధుర్ తదితరులు ఉన్నారు.

## నాయిబ్రహ్మణుల ఆత్మగౌరవాన్ని కాపాడారు

**ప్యాపిలి ఆగస్టు 11(ప్రభాతవార్త):** నాయిబ్రహ్మణుల ఆత్మగౌరవాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కాపాడారని మండల నాయిబ్రహ్మణ సంఘం నాయకులు డాక్టరు వరుణ్, కోత్తకోట వెంకటేష్‌లు అన్నారు. పట్టణంలోని వరుణ్ క్లీనిక్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ నాయిబ్రహ్మణుల ఆత్మాభిమానాన్ని కాపాడే విధంగా జీవోను విడుదల చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పలు ప్రాంతాలలో నాయిబ్రహ్మణులను చులకనగా మాట్లాడుతూ ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్ళినట్లు పేర్కొన్నారు. నాయి బ్రహ్మణులను కించపరిస్తే కఠినచర్యలు తీసుకునే విధంగా జీవోను జారీ చేయడం ఆనందంగా ఉందన్నారు. నాయిబ్రహ్మణుల సంఘాలు చేసిన పోరాటాల పలితంగా జీవో అని తెలిపారు. జీవో జారీకి కృషి చేసిన నాయిబ్రహ్మణ కార్పోరేషన్ యనాదయ్య, నాయి బ్రహ్మణ సంఘం రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నాయిబ్రహ్మణ సంఘం నాయకులు విజయ్‌కుమార్, కృష్ణంరాజు, కొత్తకోట మధు, వంశీ తదితరలు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుల పేరుతో హెరిటేజ్ వాక్ చేసిన అధికారులు, విద్యార్థులు



విద్యార్థులచే ర్యాలీ నిర్వహిస్తున్న డిఆర్వో పుల్లయ్య

**నంద్యాల, ఆగస్టు 11, ప్రభాతవార్త:** ఆజాదీకా అమృత్ మహోత్స వాల సందర ్భంగా జిల్లా పర్యాటకశాఖ, జిల్లా స్పోర్ట్స్ అథారిటి అధ్వర్యంలో హెరిటేజ్‌వాక్ నిర్వహించడం జరిగిందని డిఆర్వో పుల్లయ్య తెలిపారు. నంద్యాల స్వాతంత్ర్య సమరయోధులు ఖాదరబాదర నరసింగరావు పేరుతో గాంధీచౌక్ నుంచి ఆయన ఇల్లుమీదుగా ఆయన పేరుతో నిర్మించిన మున్సిపల్ హైస్కూల్ వరకు హెరిటేజ్‌వాక్ నిర్వహించారు. ఈసందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత ్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఈనెల 15 వరకు ప్రజల్లో దేశభక్తి పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు దేశభక్తిని పెంపొందిచుకోవాలని పేర్కొన్నారు. హర్ ఘర్ తిరంగలో ప్రతిఒక్కరు వారి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని, సెల్ఫీతీసుకొని హర్‌ఘర్‌తిరంగ వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేస్తే మీకోక సర్టిఫికెట్ కూడ వస్తుందని తెలిపారు. దేశభక్తిని ఈనాటి విద్యార్థుల్లో పెంపొందించాలంటే అనాటి స్వాతంత్ర్య సమరయోధుల గాధలు వారికి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖాధికారి గోపాల్, స్పోర్ట్స్ అథారిటి అధికారి ఎంఎన్‌వి రాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు రక్షణ కల్పించాలి



**కొత్తపల్లె, ఆగస్టు11, ప్రభాతవార్త:** మహిళల పై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టి వారికి రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రదీప్ కుమార్ గురువారం అన్నారు. స్థానిక మండల కేంద్రం కొత్తపల్లెలో రక్షక్‌బంధం సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ముమింతాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాఖీ కట్టించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ 15సంవత్సరాల నుంచి 60సంవత్సరాల మహిళల పై అత్యాచా రాలు జరుగుతుండడం మనం ప్రతినిత్యం పేపర్‌లలో చూస్తున్నా మని వారన్నారు. అలా మహిళలపై అత్యాచారాలు జరగకుండా అరిక ట్టేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పోలీస్

## ఈ క్రాప్ పై వీఆర్వో,వీఎం, వీహెచ్ఏ శిక్షణ కార్యక్రమం

**గోనెగండ్ల ఆగస్టు 11 ప్రభాతవార్త :** రైతులు ఏఏ పంటలు సాగు చేసారో సర్వే నెంబర్లు వారిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతును పొలం మధ్యలో నిల్చొబెట్టి పంట నామోదు చేయాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాజకిశోర్, తహశీల్దార్ వేనుగోపాల్ తెలిపారు. మండల కేంద్రమైన గోనెగండ్లలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం నందు రెవెన్యూ గ్రామ సిబ్బంది, వ్యవసాయ ఉద్యాన సహాయకులు, ఎంపీఇవోలు, ఒరియంటేషన్ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వేణుగోపాల్, మండల వ్యవసాయశాఖ అధికారి రాజకిశోర్ మాట్లాడుతూ ప్రధానంగా పంటల నమోదు కార్యక్రమాని పకడ్బందీగా నమోదు చేయవలసిందిగా ఆర్‌బీకే సిబ్బందిని మరియు వీఆర్వోలను కోరడమైనది. రైతులు ఎంత విస్తీర్ణంలో ఏఏ పంటలు సాగు చేసారో సర్వే నెంబర్లు వారిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతును పొలం మధ్యలో నిల్చొబెటి నామోదు చేయాలని అన్నారు. ప్రభుత్వం ఈ క్రాప్ ఆధారంగా రైతులకు వివిధ పథకాలు వైఎస్సార్ ఫ్రీ క్రాప్ ఇన్సు రెన్స్, రైతుభరోసా, సున్నా వడ్డీ, పంట ఇన్‌పుట్ సబ్సిడీ, పంట మద్దతు ధర కోనుగోలు వంటి కార్యక్రమాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. కావున ప్రతిరైతు తను వేసిన పంటను నామోదు చేసుకోవాలసినదిగా కోరడమైనది. పంటల ఈ క్రాప్ నామోదులో వీఆర్వోలు తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని అన్నారు. నమోదు కార్యక్రమంలో వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఇవోలకు సహకరించి పంటల నమోదు కార్యక్రమాన్ని వచ్చే నెల మొదటి వారం కంతా తప్పులు లేకుండా విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఇవో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న

## కెజిబివిలను అకస్మిక తనిఖీచేసిన జిల్లా అధికారులు

**నంద్యాల విద్య, ఆగస్టు 11, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణంలోని వైయస్ఆర్‌నగర్‌లో ఉన్న కస్తూరిబా బాలికల పాఠశాలల్లో ఉర్దు కస్తూరిబా పాఠశాల, అర్బన్ రెసిడెన్సియల్ హాస్టల్‌లో గురువారం జిల్లా అధికారుల బృందం అకస్మికంగా తనిఖీచేసింది. సర్వశిక్షఅభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డా.వేణుగోపాల్ అదేశాల మేరకు జిల్లాలోని అన్ని కెజిబివిలను తనిఖీచేయాలని అదేశించారు. ఈమేరకు గురువారం జిల్లా బృందంలో సభ్యులు ఎఎంఓ కుమారి ప్రత్యామ్నాయ పాఠశాలల కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు, సిఎంఓ రాజేశ్వరీ, ఐఇడి విజయప్రసాద్‌లు అకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర ్భంగా వారు మాట్లాడుతూ కస్తూరిబా పాఠశాలలను రా ష్ట్ర ప్రభుత్వం మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తో ్తందని అందుకు సిబ్బంది కూడ అప్రమత్తంగా వ్యవహారించి విద్యార్థుల సంక్షేమం కోసం పాటుపడాలని సూచించారు. ఈఏడాది నుంచి కెజిబివిల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత ్సరం కూడ అడ్మిషన్లు చేసుకోవాలని నిబంధన ఉందని అందుకు అనుగుణంగా వ్యవహారించాలని స్పెషల్ అఫీసర్లు సూచించారు. విద్యారు ్థలకు అందించే మెనును సక్రమంగా అందించాలని జగనన్న గోరుముద్ద పథకాన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికరమైన ఆహారాన్ని అందిస్తు వారిని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలని వారు అదేశించారు. విద్యార్థులకు మానసిక ఉల్లాసం కోసం అటపాటలు కూడ ప్రతిరోజు నిర్వహించాలని సూచించారు. రిజిస్టర్‌ను, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్పెషల్ అఫీసర్లతో ప్రతే ్యకంగా సమావేశమై పాఠశాలల అభివృద్ధికి ఎలాంటి చర్యలు గైకోంటున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్పెషల్ అఫీసర్లు రమాదేవి, హెబ్సిబా, అర్బన్ రెసిడెన్సియల్ హాస్టల్ అకౌంటెంట్ రాజేశ్వరీ, సంక్షేమ అధికారి నాగలక్ష్మీతో పాటు పలువురు పాల్గొన్నారు.

## మత సామరస్యాన్ని కాపాడుకుందాం

**ఆదోనిలీగల్, ఆగస్టు11, ప్రభాతవార్త ;** లౌకిక భారతదేశంలో ప్రజలు సోదరభావంతో జీవిస్తూ, మత సామస్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సీపీఎం సీనియర్ నాయకులు ఈరన్న, మహానందిరెడ్డి తెలిపారు. గురువారం మతసామరస్యాన్ని కాపాడాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు బైకు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ మైదానం నుంచి సీపీఎం సీనియర్ నాయకులు ఈరన్న, మహానందరెడ్డి బైకు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. మున్సిపల్ రోడ్డు, శ్రీనివాసభవన్, అంబేద్కర్ సర్కిల్, ఆర్ట్స్ కాలేజీ రోడ్డు వరకు బైకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎందరో కమ్యూనిస్టులు ప్రాణాలు పణంగా పెట్టి సమరంలో పోరాడారని చెప్పారు. ఎలాంటి పాత్ర లేని ఆర్ఎస్ఎస్ బీజేపీని అడ్డుపెట్టుకొని తామే దేశభక్తులంటూ ప్రగడ్బాలు పలకడం శోచనీయమన్నారు. మతసామరస్యాన్ని కాపాడుకోవాల్సిన సమయం దేశంలో నెలకొందన్నారు. 14న జనజాగరణ కార్యక్రమం ఉంటుందని, 15న జాతీయ జెండాను ఆవిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యవర్గ సభ్యులు పి.ఎస్.గోపాల్, ముక్కన్న, తిప్పన్న, మండల కార్యదర్శి లింగన్న, నాయకులు తిక్కప్ప, మాబాషా తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు

## రోడ్డుప్రమాదం వ్యక్తికి తీవ్ర గాయాలు



**దేవనకొండ, ఆగస్టు 11, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కరిడికొండ స్టేజ్ వద్ద పి కోటకొండ గ్రామానికి చెందిన కురువ రామాంజనేయులు(36)అనే వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే కురువ(బంగారి) రామాంజనేయులు ఆలూరు వద్ద ఓ గ్రామంలో జరిగిన పెళ్లి కార్యక్రమం ముగించుకు ని తిరిగి స్వగ్రామమైన పి కోటకొండకు బయలుదేరుతుండగా కరిడికొండ స్టేజి వద్ద అటువైపు వెళుతున్న కరిడికొండ గ్రామ రైతు కాడెద్దులతో పొలం పనులు ముగించుకుని ఎద్దుల కాడితో గుంటక పలుగు తగలడంతో బైక్‌పై వెళుతున్న రామాంజనేయులు తలకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన రామాంజనేయులును కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళరు మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఏపి శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వ్యక్తి మృతి

**మహానంది, ఆగస్టు 11, ప్రభాతవార్త:** ప్రముఖ శైవక్షేత్రమైన మహానందీశ్వరుని దర్శనార్థనం కర్నాటకకు బెల్గావ్ జిల్లాకు చెందిన బసవరాజు (25) మిత్రులతో కలిసి మహానందికి వచ్చారు. కోనేటిలో స్నానం అచరించేందుకు మిత్రులతో కలిసి అందరు దిగారు. అనుకోకుండా ఫిట్స్‌రావడంతో కోనేటలో మునిగిపోవడం జరిగింది. విషయాన్ని గమనించిన మిత్రులు కోనేటిలో నుంచి బయటకు తీసుకువచ్చి హుటాహు టిన నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో చనిపోయారు. పోలీసులు కేసునమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మండల అభివృద్ధికి కృషి చేస్తా : ఎంపిపి నూర్జహాన్

**హొళగుంద, ఆగస్టు 11, ప్రభాతవార్త :** హొళగుంద మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపిపి నూర్జహాన్, తనయుడు ఈసా, మండల కన్వినర్ షఫీవుల్లాలు అన్నారు. గురువారం హొళగుంద గ్రామంలో వాల్మీకి సర్కిల్ నుండి బస్టాండ్ వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో గుంతలు పడి తీవ్ర అద్వాన్నంగా ఉండడం అలాగే రోడ్డు మొత్తం బురదమయంగా మారి ద్విచక్ర వాహనదారులకు, కాలినడకన వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వారి ఇబ్బందులను చూసి ఎంపిపి నూర్జహాన్ తనయుడు ఈసా, మండల కన్వినర్ షఫీవుల్లాలు స్పందించి జెసిబితో రోడ్డు మరమత్తు పనులు ప్రారంభించారు.



జెసిబితో రోడ్డు మరమత్తులు చేయిస్తున్న ఈసా, షఫీవుల్లా

## పేదవిద్యార్థులకు జగనన్న విద్యాదీవెన ఓ వరం

**పత్తికొండ, ఆగస్టు 11, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని పేద విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన ఓ వరమని ఆర్డీఓ మోహన్‌దాస్, ఎంపి పి నారాయణదాస్‌లు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యాదీవెన పథకం కింద మంజూరైన చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గంలో మొత్తం 6430మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకం ద్వార 5672మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.3,23,57,566లు జమచేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని పేద విద్యార్థులు విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యాదీవెన పథకం ప్రవేశపెట్టి విద్యార్థులకు విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నాడన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి మూడో విడత కింద చెక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సిఎం జగన్ విద్యార్థుల కోసం అమ్మఒడి, విద్యాదీవెన, విద్యాకానుక తదితర సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విద్యకు పెద్దపీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మాధవి, సర్పంచ్ కొమ్ము దీపిక, తహశీల్దార్ విష్ణుప్రసాద్, ఏఎస్‌డబ్ల్యుఒ కెఈ బాబు, వార్డెన్లు దూదేకొండ రమేష్, వెంకటరాముడు, పావణి, భవాణి తదితరులు పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపిపి నారాయణదాస్

## ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం

**ఆలూరు, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల పరిధిలోని మూసానహళ్లి గ్రామంలో ధ్వజస్థంభం ప్రతిష్టాపన సందర్భంగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి, ఆంజనేయస్వామిలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ది కోసం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు వారి సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు రూ.50వేలు ఆలయ నిర్వాహకులకు విరాళంగా అందచేశారు. అలాగే దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోము, గోవిందు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



రూ.50వేలు అందిస్తున్న మంత్రి సోదరుడు

## 100 మీటర్ల జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ

**నందికొట్కూరు, ఆగస్టు 11, ప్రభాతవార్త:** పట్టణంలో అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా గురువారం ఎ.బి.వి.పి. ఆధ్వర్యంలో 100 మీటర్ల జాతీయ జెండా తిరంగ ర్యాలీని విజయవాణి స్కూల్ కరస్పాండెంట్ రామిరెడ్డి, సుబ్బారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా ర్యాలీ జరిగింది. ఈ సంధర్భంగా ఎ.బి.వి.పి. జిల్లా నాయకులు మహేష్ మాట్లాడుతు స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ళు అయిన సంధర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసిహార్ గర్ తిరంగా అనే నినాదంతో అందరికి తెలిసే విధంగా ఉండాలని ఉద్దేశ్యంతో ర్యాలీ చేయడం జరిగిందన్నారు. అనంతరం భానుప్రకాష్ మాట్లాడుతు ఆజాదీ అంటే స్వేచ్ఛ అమృత్ అతి పెద్ద సంరంభం..ఆజాదీకా అమృత్ మహోత్సవ్ అంటే అజరామరమైన స్వేచ్ఛా స్వాతంత్రాల సంరంభం అని అర్థం అని, ప్రతి ఒక్కరు స్వాతంత్ర సమరయోదుల స్ఫూర్తితో ముందుకు పోవాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాగరాజు, మాధవ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కరస్పాండెంట్

## గ్రామాభివృద్ధికి కృషి చేస్తా : సర్పంచ్ సరళమ్మ

**ఆదోని రూరల్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని సర్పంచ్ అల్లమ్మ గారి సరళమ్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో సర్పంచ్ అల్లమ్మ గారి సరళమ్మ ఆధ్వర్యంలో వైసిపి నాయకుడు అల్లమ్మ గారి పురుషోత్తంరెడ్డి దగ్గరుండి వీధిదీపాలు వేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వీధిదీపాలు లేకపోవడంతో గ్రామస్తులు రాత్రి వేళలో తీవ్ర ఇబ్బందులు పడేవారని ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో వీధిదీపాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామంలో ఏదైన సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈయనతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వైసిపి పాలనలో బిసిలకు పెద్దపీఠ



ఆంజనేయులు, బిసి సెల్ ఉపాధ్యక్షుడు

**తుగ్గలి, ఆగస్టు 11, ప్రభాతవార్త :** వెన్నెముకలాంటి బిసిలకు వైసిపి పాలనలో పెద్దపీఠ పడిందని బిసి సెల్ ఉపాధ్యక్షుడు చింపిరి ఆంజనేయులు అన్నారు. వైసిపి నూతన మండల కమిటీలో బిసి సెల్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికవడం చాలా సంతోషకరమన్నారు. ఇందుకు పత్తికొండ శాసనసభ్యురాలు శ్రీదేవమ్మకు, మండలంలోని వైసిపి నాయకులు తుగ్గలి మోహన్‌రెడ్డి, మామిళ్లకుంట హనుమంతురెడ్డి, సత్యప్పలతో పాటు పలువురు మండల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో పేర్కొన్న దానికంటే మిన్నగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ ఏ స్థాయిలో బిసిలకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. బిసిలను కేవలం ఓట్ల బ్యాంక్‌గా వాడుకునే రోజుల్లో వైకాపా ప్రభుత్వం బిసిలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని ఈ ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు.

## విద్య, ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుదాం



ధర్నా నిర్వహిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

**కర్నూలు విద్య, ఆగస్టు 11, ప్రభాతవార్త:** ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ విద్యారంగ సమస్యల పట్ల ఉపాధ్యాయ సమస్యల పట్ల చేపట్టిన వందరోజుల పోరుబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్‌రేట్ ముందు పికెటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎం రంగన్న మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామి సిపిఎస్‌ను తక్షణమే రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని, అన్ని పాఠశాలల్లో అంగ్లమాధ్యంతో పాటు తెలుగుమాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ విద్యారంగం పట్ల యమపాశంగా మారుతున్న జిఒ నం.117 వెంటనే రద్దుచేయాలని లేకపోతే ప్రాథమిక విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అవుతుందని తెలిపారు. జిల్లా ప్రధానకార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీ కోసం తక్షణమే షెడ్యూల్ విడుదల చేయాలని ఉపాధ్యాయ పదోన్నతులను చేపట్టాలని, పెడింగ్‌లో ఉన్న డిఎల్ అన్ని చెల్లించాలని ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్న పిఎఫ్ లోన్లు, ఎపిజే రుణాలు తక్షణమే చెల్లించాలని ప్రభుతా ్వన్ని ఈసమావేశంలో జిల్లా కార్యదర్శి ఖాసీం జీ వెంకటేశ్వర్లు, సంజీవుడు, నాగేటి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు తిక్కస్వామిలు మాట్లాడడం జరిగింది. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, వీర నాగేంద్ర, వీరేష్, మున్నీరు, నల్లన్న, శ్రీనివాసులు, రాఘవేంద్ర, మహేష్, సుదర్శన్‌రెడ్డి, రవి, శంకరప్ప, నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ స్వాతంత్ర్యంలో ప్రాణాలు విడిచింది కాంగ్రెస్ పార్టీ నాయకులే



మంత్రాయంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**మంత్రాలయం, ఆగస్టు 11, ప్రభాతవార్త:** బ్రిటిష్ పాలకుల నుండి భారతీయులు స్వాతంత్ర్యం సాధించడంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రమే తమ విలువైన ప్రాణాలను ఫణంగా పెట్టారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ బాబురావు అన్నారు. గురువారం నియోజ కవర్గ కేంద్రమైన మంత్రాలయం లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుండి రాఘవేంద్ర సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరంరాఘవేంద్రస్వామికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామ పోరాటంలో అనేకమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ప్రాణాలను పోగొట్టుకున్నట్లు తెలిపారు. భాతరదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సం.లు అయిన సందర్భంగా ఆజాదీకా గౌరవ్‌యాత్ర పేరుతో సుమారు 75 కి.మీ పాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు. ఇందులో భాగంగా మంత్రాలయం నుండి ఎమ్మిగనూరు వరకు ఈ పాదయాత్ర కొనసాగుతుందని వెల్లడించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి నాయకులు ఎవ్వరు కూడా దేశ స్వాతంత్ర్యంలో ఎటువంటి త్యాగం చేయలేదని విమర్శించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మంత్రాలయం నియోజకవర్గం నుండి పోటీ చేయడానికి సిద్దంగా ఉన్నట్లు వెల్లడించారు. కోసిగి మండలంలో ఉలిగల్ల ఈరన ్న, కేతారి గోవిందప్ప, నేసే నారాయణప్ప, గడ్డం తాయప్ప అనే నలుగురు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. పత్తికొండ ఇంఛార్జ్ బోయ క్రాంతినాయుడు, ఐఎన్‌టి యుసి జిల్లా అధ్యక్షులు బతుకన్న, ప్రధాన కార్యదర్శి సుంకన్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి జిలాని, నాయకులు నాగరాజు, మల్లేష్, తిక్కయ్య, ఆరోన్‌కుమార్, లోకేష్ పాల్గొన్నారు.

## మూడు రోజుల పాటు పంట,కుంటల్లో కూడా జెండాను అవిస్కరించండి



పీర్ల వద్ద జెండాను అవిస్కరిస్తున్న యంపిడిఓ దౌలా

**కోవెలకుంట్ల, ఆగస్టు 11, ప్రభాతవార్త :** 75వ స్వాతంత్ర వేడుకల్లో గతంలో ఎన్నడు లేని విదంగా మూడు రోజుల పాటు పొలాల్లో, కుంటల వద్ద కూడా మువ్వన్నెల జెండాను ఎగుర వేయాలని యంపిడిఓ మహ్మద్ దౌలా చెప్పారు. గురువారము కోవెలకుంట్లలో అమృత సరోవర్ కింద చేపట్టిన పనుల వద్ద మువ్వన్నెల జెండాను యంపిడిఓ మహమ్మద్‌దౌలా ఉపాది సిబ్బందితో కలసి ఎగుర వేశారు. ఈసందర్భముగా అయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 75వ స్వాతంత్ర వేడుకలను గతంలో లాగా కాకుండా ఈసారిగ విన్నూత రీతిలో పంట పొలాల్లో, కుంట వద్ద కూడా జెండ ఎగురాలని అదేశాలు జారీ చేసిందని చెప్పారు. అందులో బాగంగా మహాత్మాగాందీ జాతీయ ఉపాది హామీ నిదులు రూ 6లక్షలతో పీర్లకుంటలో పూడిక తీసే కార్యక్రమము చేపట్టామని చెప్పారు. అందులో ఈ నెల 13,14,15 తేదిల్లో మూడు రోజుల పాటు జాతీయ జెండాను అవిస్కరించాలని చెప్పారు. అందులో బాగంగానే గురువారము పీర్లకుంట వద్ద చేపట్టిన పనులను తనికీ చేసి అక్కడ జెండాను అవిస్కరించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈసి మక్బుల్, టిఎ జయబారత్‌రెడ్డి ఫీల్డుఅసిసెంట్లు, సిబ్బంది కూలీలు పాల్గొన్నారు.

## డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం

### - జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు

**కర్నూలు ఆగస్టు 11, ప్రభాతవార్త :** డిగ్రీ విద్యార్థులకు వ్యాపారంలో మెళకువలు, ఉపాధి నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రభుత్వం ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం అమలు చేయనుందని జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ అమలుపై రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆనందరావు, రిజిస్ట్రార్ మధుసూదన్ వర్మ, పరిశ్రమలు, మైనింగ్, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కమర్షియల్ టాక్సెస్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులకు అకడమిక్ విద్య తో పాటు పరిశ్రమలు, ఫ్యాక్టరీస్, మైన్స్, మాల్స్ తదితర ప్రాంతాల్లో ఇంటర్న్ షిప్ ద్వారా వ్యాపార విషయాల్లో మెలకువలు, ఉపాధి నైపుణ్యాలు పెంపొందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందుకోసం మొదటి సంవత్సరంలో రెండు నెలలు, రెండవ సంవత్సరంలో రెండు నెలలు, మూడవ సంవత్సరంలో ఆరు నెలలు మొత్తం పది నెలలు ఇంటర్న్ షిప్ అందించాలని ఆదేశించిందన్నారు.. జిల్లాలో రాయలసీమ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ ఫైనల్ ఇయర్ లో 10638 మంది, సెకండ్ ఇయర్లో 9576 మంది డిగ్రీ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు.. వీరందరికీ ఇంటర్న్ షిప్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.. పరిశ్రమల శాఖ, కమర్షియల్ టాక్సెస్, మైనింగ్, ఇన్స్పెక్టర్ ఫ్యాక్టరీస్ తదితర శాఖల నుండి పరిశ్రమలు, మైన్స్, ఫ్యాక్టరీలు, షాపులు, మాల్స్ జ్యువలరీ షాపులు తదితర జాబితా తీసుకొని ఇంటర్న్ షిప్ ఇచ్చేలా అమలు చేయాలని రాయలసీమ యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ లకు సూచించారు.. ఇందుకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేసి వచ్చే వారంలో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం సోమశేఖర్ రెడ్డి , మైనింగ్ డిడి నాగిని, బత్తి దెవలప్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, కమర్షియల్ టాక్స్, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాల సహాయకులు జేఎల్ పదోన్నతులకు అర్హులు కారా

**ఆదోనిటౌన్, ఆగస్టు11, ప్రభాతవార్త ;** దశాబ్దాలుగా సర్వీసులో ఉన్న పాఠశాల సహాయకులు జూనియర్ లెక్చరర్ల పదోన్నతులకు ఎందుకు అర్హులుకారని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదోనిలోని పురపాలక ఉన్నత పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాల, గురుకుల పాఠశాల, బాలికోన్నత పాఠశాల, డిగ్రీ కళాశాలలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు వారి సమస్యలను ఆయనతో చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు పదోన్నతులు తక్కువ సమయంలోనే వస్తున్నాయని, అయితే విద్యాశాఖలోని పాఠశాల సహాయకులకు సర్వీస్ మొత్తం ఒక్క పదోన్నతి కూడా లభించడం లేదన్నారు. ఎటువంటి బోధన అనుభవం బోధనేతర సిబ్బందికి 10 శాతం కోటాతో జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు ఇస్తూ సుధీర్ఘ బోధనా అనుభవం ఉన్న పాఠశాల సహాయకులకు జేఎల్‌లుగా పదోన్నతులు ఎందుకు ఇవ్వలేక పోతున్నారన్నారు. వీరికి జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పిస్తే మిగిలిన ఉపాధ్యాయులకు కూడా పదోన్నతులమార్గం సుగుమమవుతుందన్నారు. ప్రభుత్వం వీరికి పీజీటీలుగా పదోన్నతులు కల్పిస్తామన్న ఆలోచన మానుకుని జూనియర్ లెక్చరర్లుగా మాత్రమే పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనునిత్యం కొత్త యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులను వేధించడం ప్రభుత్వం మానుకోవాలని, తగిన సామర్థ్యం ఉన్న ఉపకరణాలను వారికి అందజేయకుండా ఆన్‌లైన్ పనులు చేయాలని, ఒత్తిడి చేయడం ఎంతవరకు సబబు అన్నారు. గురుకుల ఉపాధ్యాయులకు పీఆర్సీని అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించి పార్ట్ టైం వారిని కాంట్రాక్ట్‌లోకి మార్చాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులను మినిమం టైం స్కేల్ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గజ్జల వేమనారాయణరెడ్డి, ఆపస్ జిల్లా అధ్యక్షులు శ్రవణ్, శ్రీనివాసులు, రామక్రిష్ణ, పీడీ అసోసియేషన్ నాయకులు భూపాల్‌రెడ్డి, రామదాసు, ఏపీఎంటీఎఫ్ నాయకులు సురేష్, సీపీఎస్ నాయకులు రమేష్, రమణారెడ్డి, వేణు, ఎస్ఎల్‌టీఏ నాయకులు నాగరాజు, రంగస్వామి, మహేష్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

## విద్యాదీవెనకు ప్రతి పేద విద్యార్థి అర్హులు



మాట్లాడుతున్న బిసి సాధికారత సమితి కన్వీనర్

**కర్నూలు న్యూసిటి, ఆగస్టు 11, ప్రభాతవార్త:** విద్యాదీవెన పథకానికి ప్రతిపేద విద్యార్థులు అర్హులని టిఎన్ఎస్ఎఫ్ అధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో కర్నూలు పార్లమెంట్ జనరల్ సెక్రటరీ ప్రవీణ్, కిరణ్, నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షులు లతీఫ్, టౌన్ మహిళా కార్యదర్శి చంద్రకళలు పాల్గొని మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాదీవెన పథకం ద్వారా పేద విద్యార్థులకు మేలు జరుగుతుందని చెప్పి, ప్రతి ఒక్కరికి విద్యాదీవెన పథకం అందుతుందని అనేక కారణాలు చూపించి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అన్యాయం చేశారని తెలిపారు. ఈపథకం ద్వారా ఎంతమంది విద్యార్థులు లబ్ధిపొందుతున్నారని ఒకసారి గమనించాలి. అనేక చిన్న, చిన్న కారణాలు చూపించి అర్హులైన వారికి కూడ ఈపథకం వర్తింపచేయకుండా చేశారని విమర్శించారు. గత ప్రభుత్వం చంద్రబాబునాయుడు పేద విద్యార్థులకు విదేశాలకు పంపి వారిని చదివించి వారికి ఉద్యోగ భద్రత కల్పించిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కిందన్నారు. విద్య అనేది ప్రతిఒక్కరి ప్రాథమిక హక్కు అని తెలియదా? పాఠశాలలు రద్దుచేశారు వార్డన్ పోస్టులను భర్తీచేయకుండా హాస్టళ్లలో ఇన్‌చార్జీలుగా నియమించారు. వారు విద్యార్థులకు సరైన విద్యను అందించక ఇబ్బందులు పడుతున్నారు. నాడు నేడు కింద పాఠశాలల రూపురేఖలు మారుస్తామని చెప్పి ప్రభుత్వ ఖజానా అంతా ఖాలీచేశారు. పేద విద్యార్థులకు విద్యాదీవెన పథకం అందించి, యువతకు ఉద్యోగ అవకాశాలు కలి ్పంచాలని ఈసందర్భంగా డిమాండ్ చేశారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

**బండిఆత్మకూరు, ఆగస్టు 11, ప్రభాతవార్త:** ప్రతిఇంటిపై జాతీయజెండా రెపరెపలాడాలని ఎంపిడిఓ వాసుదేవగుప్తా అన్నారు. మండల కేంద్రమైన బండిఆత్మకూరులో గురువారం జ్యోతి ఉన్నత పాఠశాల ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర ్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 75 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిఒక్కరు పంద్రాగష్టు వేడుకలు ఘనంగా చేసుకుందామని ఆయన తెలిపారు. అనంతరం విద్యారు ్థలతో కలిసి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎఎస్ఐ అక్బర్, ఎఫ్ఆర్ఓ నసీర్‌ఖా, పంచాయితీ సెక్రటరీ నటరాజన్, జ్యోతి స్కూల్ చైర్మన్ నర్ల శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపిడిఓ

**KURNOOL MUNICIPAL CORPORATION**

e-Procurement Notice

Tender Notice No.27-1 to 27-3/General Funds/EE&SE/Knl/22-23, dt. 11-08-2022 (Short Tender) and Tender Notice No.27-4 to 27-10/General Funds/EE&SE/Knl/22-23, dt. 11-08-2022

| Name of the Scheme | General Funds (short tender) | General Funds |
|---|---|---|
| No of works | 03 | 07 |
| Bid document download starting date | 12/08/2022 at 5:30 P.M | 12/08/2022 at 5:30 P.M |
| Bid document download end date | 20/08/2022 at 5:30 P.M | 01/09/2022 at 5:30 P.M |
| Last Date & Time for receipt of Bids | 20/08/2022 at 5:30 P.M | 01/09/2022 at 5:30 P.M |
| Commercial Bid Opening Date | 20/08/2022 at 5:30 P.M | 01/09/2022 at 5:30 P.M |

Further details can be seen @ e procurement market place at www.tender.apeprocurement.gov.in. A.Bhargav Teja, I.A.S., Commissioner, Kurnool Municipal Corporation, Kurnool. For Contact 9849908497, 8008403996.

Sd/- A.Bhargav Teja, I.A.S., Commissioner, Kurnool Municipal Corporation, Kurnool.

